# ఆత్మజాగృతి

చలిగాలి రివ్వున వీస్తోంది కిటికీలోంచి. రైలు వేగంగా పరుగెత్తుతోంది. గిర గిరా తిరిగే రైలుచక్రాలలాగానే, ఆలోచనా తీవ్రతతో పరిభ్రమించే హృదయాన్ని విడవకుండా వెన్నాడుతోంది భరించలేని వ్యథ. తదేకంగా ఆ చక్రాల ఘోషనే ఆలకిస్తున్న రమాదేవికి 'నన్ననకే! నన్ననకే!' అంటూ రైలు తన హృదయపు టార్తనాదాన్నే పలుకుతున్న ట్లనిపిస్తోంది.

ఆమె పక్కనే, కూర్చుని అదేవిధమైన బాధతో, ఆలోచనలతో తల మునక లవుతోంది కామేశ్వరి. మాటిమాటికీ కళ్లు తుడుచుకుంటూ, ఒకసారి రమాదేవి వేపు, మరొకసారి ఆకాశం వేపూ దృష్టిసారిస్తూ మనసులోనే వేయి దేవుళ్లకి పదేపదే మొక్కుకొంటోం దామె.

బయట గాఢాంధకారంతో పాటు నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. కంపార్టుమెంటులో ఎవరూలేరు. కామేశ్వరీ, రమాదేవీ ఎవరి ఆలోచనల్లో వారు మునిగిపోయి, భవిష్యత్తునిగూర్చి భయసందేహాలు ముప్పిరిగొన్న మనసులతో కూర్చుని ఉన్నారు.

చలి ఎక్కువగా ఉంది. చల్లనిగాలి ఒకసారి విసురుగా లోపలికి కొట్టేసరికి కామేశ్వరి శరీరం రోమాంచమైంది. ఆమె పమిటకొంగు బుజంమీదుగా కప్పుకుంటూ 'చలిగాఉంది! పైకిఎక్కి పడుకోరాదూ?' అంది రమాదేవితో.

తల్లి వేపుదిగులుగా, భయంగాచూస్తూ 'చలిలేదు' అని మాత్రం అంది రమాదేవి.

కొన్నాళ్ళనుంచీ ఆ విధమైన చూపుల కలవాటుపడిపోయిన కామేశ్వరి వాటిని గుర్తించకుండా, విరక్తితొణికే స్వరంతో 'చలెందుకులేదూ? పడుకో. స్వెట్టర్ వేసావా పెట్టెలో?' అని అడిగింది.

'లేదు.' అంది రమ.

'అవును. ఒకటి తోచేట్లుందా? సరేలే! పడుకో. ఊరికే కూర్చుని ఆలోచిస్తే ఏమవుతుంది? పడుకో పడుకో.' అంది కామేశ్వరి ఆవులిస్తూ.

రమ పడుకోలేదు. బాధగా, దిగులుగా బయటికిచూస్తూ కూర్చుంది.

## ప్రతిమాదేవి

రైలుతోపాటేకదిలివస్తోం దాకాశం. విడవకుండా వెన్నాడుతోంది హృదయ బాధ; రైలుమాత్రం చీకటిని చీల్చుకుంటూ పరుగులు పెడుతూనే ఉంది.

రమాదేవి కెందుకో తన బ్రతుకు కిక ఉషారేఖ విరియ దనిపించిందా రాత్రి!

* * *

తెలతెలవారుతూ ఉండగా రైలు మెడ్రాస్ చేరుకుంది.

భర్తకోసం కిటికీలోంచి, ఆదుర్దాగా తొంగిచూస్తున్న కామేశ్వరి, తీరా అతను వచ్చి 'దిగండి.' అనేసరికి, అకారణంగా ముంచుకువచ్చిన పుట్టెడు దుఃఖాన్ని అరికడుతూ కళ్ళనీళ్లు ఒత్తుకుంది.

'ఊc. దిగండి. దిగండి.' అన్నాడు శేషగిరి విసుగుదలగా.

కామేశ్వరీ, రమాదేవీ రైలు దిగారు. వెంట కూలీ, సామాను మోసుకు వస్తూఉంటే, ముందు శేషగిరి, తర్వాత కామేశ్వరీ వారివెనక తడబడే అడుగులతో తలవంచుకుని రమాదేవీ స్టేషన్లోంచి బయటపడ్డారు.

శేషగిరి టాక్సీ కుదిర్చి, కూలివాడికి డబ్బిచ్చి పంపేసి, భార్య కారు ఎక్కాక 'ఎక్కు!' అన్నట్లు కూతురివేపు బెట్టుగా చూశాడు.

రమాదేవి చూపులు దించుకుంది.

'ఎక్కూ!'—కారులోంచి సానుభూతి లేని తల్లి కటుస్వరం రమాదేవి మనసుని ములుకులా నాటింది. ఆమె మాట్లాడకుండా, అన్నిటికీ తలవంచానన్నట్లుగా, నిర్లిప్తంగా టాక్సీ ఎక్కింది.

కూతురి మనసులో బాధ ఊహించుకోగలిగిన శేషగిరి జాలితో కరిగిపోతూ— తనుకూడా టాక్సీ ఎక్కాడు.

తలోకరకంగా బాధపడే ఆ ముగ్గుర్నీ ఎక్కించుకుని టాక్సీ కదిలింది.

* * *

లాడ్జిలో అడుగు పెట్టీపెట్టగానే 'డాక్టర్నెవరైనా కనుక్కున్నారా?' అని అడిగింది కామేశ్వరి ఆత్రం పట్టలేక.

బాత్రూమ్లోకి వెళ్ళిన కూతుర్ని సూచిస్తూ, శేషగిరి కంఠం బాగాతగ్గించేసి 'కనుక్కున్నాను. ష్ అరవకు. అది వింటే బాధపడుతుంది.' అన్నాడు.

కామేశ్వరి విరక్తితోపాటు అసహ్యం తొణికిస్తూ 'ఆc, ఇంకా బాధ ఏమిటి? బాధపడేదీ, ఇంగితం కలదీ అవుతే అస

లిటువంటి పాడుపని చేసేదేనా? ఇంకా బాధేమిటి?' అంది.

'ష్ అరవకు. నీకా్కదూ చెప్పేది? అన్నీ ముందుగా కనుక్కుని ఏర్పాటు చేయటానికేగా నేను మీకంటే ముందు వచ్చిందీ? చెప్పినమాట వినవేం?' అని మందలించాడు శేషగిరి భార్యని.

కామేశ్వరి కోపంగా మొహం తిప్పుకుని వెళ్ళిపోయింది.

'నేను ఇప్పుడే వస్తాను. ఈలోగా మీరు స్నానం అదీచేసి సిద్ధంగా ఉండండి. కాఫీ టిఫిన్ పంపించివెళ్తాను.' అంటూ శేషగిరి ఏదో పనిమీద కిందికి వెళ్ళాడు.

—రమాదేవి బాత్‌రూమ్‌లోంచి ఎటూ చూడకుండా సరాసరి వచ్చి కిటికీ పక్కన కుర్చీలో కూర్చుంది. ఇప్పుడామెకు తల్లివేపు చూడటానికికాని, ఆమెతో మాట్లాడటంకాని ఇష్టంలేకుండా ఉంది. ఆమెవేపు చూసి ఆచూపుల్ని తట్టుకునే శక్తి తను కూడదీసుకోలేదు. జరిగిన దారుణం కాక, తరువాత ఎదురయ్యే ఈ నిశితదృష్టులు, బాధించే మాటలు ఇవి సహించటమే మహాకష్టం. జరిగిందెలాగూ జరిగిపోయింది! ఫలితం, ఎలాటిదైనా అనుభవించటానికి తను సిద్ధంగా ఉంది! కాని అందుకు తన తల్లి దండ్రులు సిద్ధంగా లేరు! తన జీవితం తన ఒక్కతెదే కాదు. తన బ్రతుకుతో అనేకుల బ్రతుకు భావాలు పెనవేసుకుని ఉన్నాయి. అయినప్పుడిక వారి నిర్ణయాలను కాదనటానికొకవిధంగా తనకి హక్కులేదనే భావించింది తను! అందుకే నిశ్చలంగా, నిర్లిప్తంగా వాళ్ళు తననేం చేయదలుచుకున్నారో దానికి తల ఒగ్గింది. కాని వీళ్ల ఈ చర్యలవల్ల సంక్రమించే బాధ ఒక్కటి మాత్రమే తనది.

కుర్చీలో నిశ్చలంగా కూర్చుంది రమ.

'స్నానం చేయకూడదూ త్వరగా తెమిలి వెళ్దాం.'

రమాదేవి తల తిప్పకుండానే చీరె కుచ్చెళ్ళు సవరించుకుంటూ 'చేశాను.' అని జవాబు చెప్పింది తల్లికి.

'కాఫీ వచ్చింది లే. అలా కూర్చుంటే ఏ దేవుడన్నా వచ్చి కాపాడతాడా? రక్షించే మహానుభావుడు ముందుగానే రక్షించాడుగా' అంది కామేశ్వరి వెటకారంగా.

రమాదేవి లోలోపల బాధతో కుమిలిపోయింది. కన్నీటిని నిగ్రహించుకుంటూ లేచివెళ్ళి టిఫిన్ తిని, కాఫీ తాగింది.

'నాన్నగారిప్పుడే వస్తానన్నారు. బట్టలు మార్చుకో!' అంది కామేశ్వరి.

రమ మెల్లిగా 'ఇవి చాలు' అంది.

కామేశ్వరి కోపంతో 'ఈ విరక్తి కేంలే? ఆ బట్టలతో ఎలా వస్తావు? లే? లే? బట్టలు మార్చుకో! ఇలా విరక్తిపడేవాళ్లకే అన్ని పాడుపనులూను!' అంటూ పెట్లోంచి బట్టలు తీసి బయట పడేసింది.

తల్లి తీసియిచ్చిన బట్టలు తీసుకుని గదిలోకి వెళ్తున్న రమాదేవి కామె మాటలు మనసుని తినేసేలా అనిపించాయి.

మనసులో ఈ వ్యథకితోడు, కడుపులో ఏదో తిప్పి, కళ్ళు బైర్లు కమ్ముతూ ఉంటే గబగబా బాత్‌రూమ్‌లోకి పరుగెత్తి వాంతి చేసుకున్నది రమాదేవి. తన నేరానికి అది నిదర్శనం :

అవిరళధారగా ప్రవహించే కన్నీటితో అలాగే మతిపోయినట్లుగా చూస్తూ నుంచుందామె....

* * * *

'మీ సహాయం ఎప్పటికీ మరిచిపోము. మమ్మల్ని మళ్ళీ మనుషులుగా చేశారు మీరు! దేవుడుకూడా మీరు చేసిన సహాయం చేసివుండడు మాకు!' అంది కామేశ్వరి కృతజ్ఞత ఉట్టిపడే స్వరంతో.

తను ఈ వైద్యవృత్తిలో ప్రవేశించిన నాటినుంచీ ఇటువంటి కేసులు లక్షలాదిగా చూస్తున్న లేడీడాక్టరు, కామేశ్వరి మాటలకు తేలిగ్గా నవ్వేసి 'బహుశా నేను చేశానని భ్రమపడుతున్న ఈ సహాయం దేవుడే చేశాడేమో మీకు! అలా అనకండి' అంది నవ్వుతూ.

కామేశ్వరి కిప్పుడు గుండెల్లోంచి పెద్ద బండరాయి తొలగించినంత తేలిగ్గా ఉంది. ఆమె డాక్టరుమాటల్ని వెంటనే అంగీకరిస్తూ 'నిజమేనిజమే! దైవసహాయం లేనిది ఎవరివల్లమాత్రం ఏమవుతుంది?' అన్నది.

డాక్టరుఫీజు కవరులోపెట్టి ఆమెకిస్తూ శేషగిరి ముభావంగా 'థాంక్స్‌డాక్టర్!' అని చెప్పి వెనక్కి తిరిగాడు.

డాక్టరు ఆ కవర్ని నిర్లక్ష్యంగా డ్రాయర్లోకి తోసేసి వాకిలిదాకా వారి ననుగమించింది.


గండంగడిచిబయటపడ్డామనికామేశ్వరి ఎంత సంతోషిస్తోందో, అంతగా ఇదంతా ఇలా ఒక పీడకలలా జరిగిపోయిందేమిటా? అని ఆమెమనసు మాటిమాటికీ విభ్రాంతి చెందుతోంది.అందుకే లోలోపల అవమానలేశం తొంగిచూస్తూ ఉంటే. అంత హాయిలోనూ ఆమె చిన్నబోతూనేఉంది.

వాకిలిదాకా వచ్చాక, మనసు నింక అరికట్టలేక, ఎంత సేపటినుంచో అడుగుదామనుకుంటున్న కోరిక బయటపెట్టింది కామేశ్వరి.

'దయచేసి డాక్టరుగారూ ఇలా ఫలానావాళ్ళకీ విధంగా జరిగిందని మాటమాత్రమైనా ఎవరితోనూ అనరుకదూ. మీకు ఆజన్మాంతం కృతజ్ఞులమై ఉంటాము!!' అంది.

భార్య అభ్యర్థనలోని దౌర్బల్యానికి చిన్నబోయినా, డాక్టరుముందు ఆమెనేమీ అనలేని అశక్తతతో శేషగిరి శుష్కంగా నవ్వు నవ్వి టాక్సీ ఎక్కాడు.

లేడీ డాక్టరు కామేశ్వరి చేతులు విడిపించుకుంటూ చాలా మృదువైన స్వరంతో 'నో, నో, నో, మీ రలాటి భయమేమీ పెట్టుకోకండి మనసులో.



"ఇదేం ఖర్మ ! వీడు మనిషా ? కోతా ? న-రా-లు తోడుకుంటున్నయ్........"
"స్స్....; మరొక్క ఐదు నిమిషాలు ఓపికపట్టు! దిగిపోతాం; లేకుంటే మళ్ళీ మన డైరెక్టర్ డార్విన్ సిద్ధాంతంమీద తనకున్న విశ్వాసాన్ని రెండుగంటలపాటు లెక్చర్‌కొట్టి చంపుతాడు; మనిషే; చిన్నతనంలో కోతుల్ని ఆడించే తండ్రితో ఊరూరా తిరిగేవాడట...."

మా కిదొక్కటే కాదుగా. నేనిప్పుడే ఈ విషయం మఱచిపోతాను. సరేనా 'అంది

తేలికపడిన గుండెలతో కామేశ్వరి టాక్సీ ఎక్కింది.

కాని, టాక్సీలో, లజ్జావమానాలతో కుంగిపోతూ, తనతో చూపు లెక్కడ కలుస్తాయోనన్న తీవ్రమైన భయంతో మూలకి ఒదిగి కూర్చున్న రమాదేవి దీన స్వరూపం డాక్టరు కొక్క క్షణం విస్మరించరానిదైంది. ఆమె వెళ్ళిపోతున్న టాక్సీవేపలాగే నిర్నిమేషదృష్టితో ఒక్క క్షణం చూసి, వెంటనే నిట్టూరుస్తూ లోపలికి వెళ్ళిపోయింది.

*　　*　　*

'హమ్మయ్య! ఇంక గట్టెక్కినట్లే! అబ్బ! ఎన్నడూ ఎరగం మనవంశంలో! ఛీ! ఛీ! ఎంత పాడుపని చేసిందీ!' — పక్కనే కూతు రుందని తెలిసీ చీదరించుకుంది కామేశ్వరి.

శేషగిరి అప్పటికేమీ అనలేదు కాని తర్వాత భార్యని చాటుగా పిలిచి చెప్పాడు. 'నువ్వు మాటిమాటికీ అమ్మాయినలా చిన్నబుచ్చకు! నీ కసలు అధిక ప్రసంగం ఎక్కువ! పైకి అనుకుని మనసుల్ని బాధపెట్టే విషయాలా ఇవి! తల్లివి నువ్వు! నీ కూతురి మనసు గాయపడుతుందేమో నని నీకుండాలి!' అన్నాడు.

అంతవరకూ తమ పరువూ, ప్రతిష్ఠా, తన కూతురిపై పెట్టుకున్న ఆశలు అన్నీ బూడిదపా లయ్యాయని క్రుంగిపోతున్న కామేశ్వరి ఒక్కసారి మాతృప్రేమతో కరిగిపోయి జాలిగా ఏడ్చింది.

'కడుపులో క్షోభ భరించలేక ఇలా అనుకుంటున్నాను కాని, నాకుమాత్రం దాన్ని నేనే అంటే అందరూ అనిపోతారన్నవిషయం తెలియదా. ప్చ్. ఇంకా అది నాకూతురేమిటి? దానిమీద నేనెన్ని ఆశలు పెట్టుకున్నాను? అవన్నీ తీరే మార్గం లేకపోగా, ఇప్పుడు నలుగురిలో తలెత్తుకు తిరిగే ధైర్యమే పోయిందికదా నాకు!' అంటూ ఏడ్చిందామె.

శేషగిరి భార్య మాటలకు చికాకు పడుతూ 'అటువంటి మాటలే రానీయకు దాని దగ్గర! అది స్వతహాగా ప్రతి చిన్న దానికీ బాధపడుతుంది. దాని ఎదుట ఇలా అనటం మానకపోయావంటే అది పిచ్చిదైపోవటానికి ఎంతో కాలం పట్టదు. పరువూ, పిల్లా ఒకటేనా మనకు? నిజమే! పరువు పోయిందని బాధగానే ఉంటుందనుకో! అంతమాత్రాన పిల్లని చీటికీ మాటికీ బాధపెడితే వచ్చే దేమిటి చెప్పు నీకు?' అంటూ ఆ సాయంకాలమే తిరుగు ప్రయాణానికి టిక్కెట్లు బుక్ చేయటానికి వెళ్ళాడతను.

*　　*　　*

సాయంకాలం, సూర్యాస్తమయవేళ, స్వంతయింట్లో గదిలో, ఎంతసేపటినుంచి ఆకాశంవేపు చూస్తోందో, ఆ చూపుల్లో ఏయే భావాలు, ఏనైరాశ్యం దాగిఉందో ఎరుగరాని మహా విషాదం గూడుకట్టుకున్న కళ్ళతో అలా కూర్చున్నది కూర్చున్నట్లేఉంది రమాదేవి చిత్రప్రతిమలా. జీవితమంతా బీటలువాఱి, ఆ నెరియలలోంచి విధికరాళదంష్ట్రిలు భయంకరంగా తనని గ్రసించనున్నట్లుగా దుర్భర నైరాశ్యకీలల్లో కుమిలిపోతోందామె. తన హృదయం ఇప్పుడు ఇంకిపోయిన రసధుని! కన్ను పొడుచుకు చూచినా, కాస్తంతైనా అందాలు కనిపించని కారుచీకటులతో కప్పివేయబడిన విశీర్ణ మందిరం ఆమె హృదయం నేడు! శరీరంతో పాటు అలసమైపోయిన గుండెలతో, బ్రతుకు భారంగా. భారమైన భావంగా గుప్పిట్లో ప్రాణాలు పెట్టుకుని భవితవ్యంకేసి నిరీక్షిస్తోందామె ఆశలేని ఆశతో!!

ఆమె ఆశ ఇప్పుడు మరణం;

— రమాదేవి కళ్ళల్లో అశ్రువు లూడి అంతలోనే ఇంకిపోయాయి. ఏడవటానికూడా శక్తిలేదిప్పుడామెకు. తన జీవితం హఠాత్తుగా ఇంతటి దుర్భరావస్థలో చిక్కుకున్న దేమిటి? తుళ్లుతూ,

త్రెళ్లుతూ, గంతులు పెడుతూ స్వేచ్ఛగా సంచరించే లేడిపిల్ల మృగయుడి పాశాలకు చిక్కి మరి తప్పించుకోలేకపోతే! చంద్రికకై నిరీక్షించే చకోరికి చంద్రోదయమే అసంభవమవుతే! అబ్బ! ఎంత బాధ అది! ఆడుతూ. పాడుతూ ఆనందంతో పరవశమవుతూ, ఇంటికంతా వెలుగుగా సంచరించే తను జీవితంపట్ల రక్తి కోల్పోయి ఇలా అయిపోయిందేమిటి? ఇలా అవుతుందని కనీసం ఊహించగలిగి అయినా ఉంటే, ప్రకృతి శక్తుల ప్రభావానికి తను దూరంగా ఉండి ఉండేది. ఇవాళ ఎటూ కాకుండా పోయింది తన బ్రతుకు!

ఎంత వంచన జరిగిపోయింది బ్రతుకులో?

'అమ్మా! రమా! టిఫిన్ తినకుండా అలా ఒదిలేశావేం?'

—రమాదేవి తల్లికేసి నిర్లక్ష్యంగా క్రీగంట చూసింది. కాని జవాబు చెప్పలేదు.

'ఏం తల్లీ!'— ఆలనగా పిల్చింది కామేశ్వరి.

— కాని రమాదేవి ఆమె ప్రేమ సహించలేకపోయింది. తన బ్రతుకీవిధంగా పరిణమించిన క్రొత్తల్లో ఆమె కనీసం మాటలో, పిలుపులోనైనా ఎవరైనా తనపట్ల సానుభూతి కనబరచితే చాలని, ప్రేమ చూపితే చాలని ఎదురుచూచేది. అది తానెదురుచూచినవారినుంచి లభించలేదామెకు. తనకైన మనుషులని తాను భావించినవారంతా, ఒక్క తండ్రిమినహా 'ఇదికూడా నవ్వటమా? ఏం చూసుకుని?' అన్నట్లు చూశారు తనను. మనుషులెప్పుడు—ప్రేమమయులేననీ, ఎటువంటి పరిస్థితులలోనైనా, 'తన' అనుకున్నవాళ్లు తనని బాధించరనీ భావించిన రమాదేవికి అవి కేవలం ఊహాలే అని అర్థమైపోయాయి. మనుషులు స్వచ్ఛంద హృదయులవుతే ఆలాంటివారిని ప్రేమించటంలో గొప్ప ఏముంది? ఎవరు బాధితులో ఎవరు అపరాధులో వారికే నిలవదొక్కుకోగల విశ్వాసమూ, ఆలంబనా కలిగించాలి కాని! మనుషులు స్వచ్ఛంద ప్రేమనివ్వటానికి అసమర్థులు. అలాగే అలాటి ప్రేమ పొందటానికీ అనర్హులు. కాని మనసులు పెరిగిన మహనీయులు ఒద్దన్నా ఇవ్వగల ఉదారులు! అటువంటివారే తనకింతవరకూ కనిపించలేదు....

జీవితపు టాటుపోట్లకు తట్టుకుని ఒకటే విధంగా నిలవలేని ఈ విధమైన ప్రేమకోసం రమాదేవి ఇప్పు డెదురుచూడలేకుండా ఉంది. అందుకే తల్లి పిలుపులోని లాలన వెగటై, ఆమె ప్రేమభరించలేనేమోననే భయంతో అక్కడినుంచి లేచి వెళ్ళటానికి ఉద్యుక్తురాలయిందామె.

హఠాత్తుగా, ఉద్రేకంగా లేచి నిలబడిన కూతుర్ని చూసి కామేశ్వరి విస్తుపోయింది. ఇంట్లో ఎవరితోనూ మాట్లాడని ఆమె మౌనం, అహరహమూ ఏదో ఆలోచిస్తున్నట్లుండే ఆమె చూపులూ, కామేశ్వరిని చెప్పరాని ఏదో సంశయంతో పీడించసాగాయి. ఇవాళ ఎందువల్లనో ఆ సంశయం దృఢమై కామేశ్వరి నిలువెల్లా ఒణికిపోయింది. తనకున్నది ఒక్కగానొక్క కూతురు!!

అప్పటినుంచీ ఆమె రోజూ రమాదేవి పడుకున్నతరువాత ఆమె దిండుకింద వెతికి, మంచినీళ్లు రుచిచూసి వచ్చి పడుకునేది. ఒకనాడిలాగే చూస్తూ ఉండగా మెళుకువవచ్చి, తల్లి భయం గ్రహించి విషాదంగా అన్నది రమాదేవి. 'భయం లేదమ్మా! పాపులు త్వరగా చావరు. చచ్చే ఉద్దేశం నాకసలులేదు. వెళ్లు.'అని.

ఆమె మాటల్లో పొంగిన విషాదానికి కామేశ్వరికి దుఃఖం పొర్లుకువచ్చింది.

'నా తల్లీ!' అంటూ కూతుర్ని కావిలించుకుని బావురుమన్నదామె.

*       *       *

మెడ్రాస్‌నించి రమాదేవి వచ్చిందని తెలిసినప్పటినించీ మోహన్ కామెనెలాగైనా కలుసుకోవాలని ఎంత ఆత్రంగా ఉందో, అంతగా ఆ కలయిక ఊహించుకుంటే భయంగానూ ఉంది. బంధుత్వం పురస్కరించుకుని, తమ స్నేహాన్ని పెంచి పెంచి చివరకు ఆమెను తను ఏదుస్థితిలోకి దించాడో, ఆ విషయాన్ని గురించి అతను అనుక్షణం బాధపడుతూనే ఉన్నాడు. కాని తను అసమర్థుడు! ఏదీ ముందు ఎలా ఆలోచించుకోడో, హఠాత్తుగా మీద వచ్చిపడ్డ అవాంతరాలనూ అలాగే ఎదుర్కోలేడు! తనలాంటి దుర్బలుడు రమాదేవి స్నేహం కోరటమే మహాదౌర్బల్యం!!

దాదాపు నెలరోజులనుంచీ మోహన్‌కి నిద్రలేదు. ఆహారంలేదు. ఎప్పటికప్పుడు మడతలు మాయని ఇస్త్రీ బట్టలతో, నున్నని క్రాపుతో పూలరంగడులా తయారయే అతనికిప్పు డవేమీ పట్టటంలేదు. తను రమాదేవి నన్యాయంచేశాడు. ఆమెని కలుసుకుని క్షమాపణ కోరటమే అతని ఏకైక లక్ష్యం ఇప్పుడు.

కాని ఆమెని కలుసుకునే మార్గమే అతనికి కనిపించడంలేదు. తను వాళ్లింటికి ధైర్యంచేసి వెళ్లవచ్చు. కాని ఎవ్వరూ తను వచ్చినట్లయినా గుర్తించరు. పలకరించరు. అంతకంటే "ఇంకా ఎవర్ని ఉద్ధరించటానికి నాయనా? ఎందుకు మాయింటికి రావటం?" అని నాలుగూ అడిగేయగల సమర్థురాలు కామేశ్వరి.

అతని కేటూ పాలుపోవటంలేదు. భరించలేని వ్యధతో, పాపం చేశాననే దుర్భరావేదనతో అతని హృదయం కాలిపోతోంది.

*       *       *

ఒకనాటి మిట్టమధ్యాహ్నం రమాదేవి గదిలో కూర్చుని ఏదో కుట్టుపని చేసుకొంటోంది. కామేశ్వరి ఎక్కడో

పడుకుని నిద్రపోతోంది. శేషగిరి ఆఫీసుకి వెళ్లాడు.

అదే సమయాన మోహన్ మెల్లిగా కిటికీదగ్గరకు వచ్చి మెల్లిగా "రమా!" అని పిల్చాడు.

ఉలిక్కిపడి తలెత్తింది రమ. ఆమె ప్రాణమే స్తంభించినట్లయిందతన్ని చూసేసరికి.

ఒకసారి వాకిలివేపు బెరుకుగా చూసి, అంతలోనే సర్దుకుని ముక్తసరిగా 'ఎవరు కావాలి?' అని అడిగిందామె.

మోహన్ జాలిగా అడిగాడు.

'లోపలకు రావచ్చా?'

రమాదేవి ఒక్కక్షణం తటపటాయించింది. తర్వాత ఏమనుకున్నదో ఏమో గబగబా వెళ్ళి వాకిలితలుపు తెరిచి 'రా' అంది మోహన్‌తో.

మోహన్ లోపలికి వచ్చాడు.

అతను బెరుగ్గా గది నాలుగువేపులా కలయచూస్తూ 'మీ అమ్మ లేదా?' అని అడిగాడు.

'ఉంది. నిద్రపోతోంది' అంది రమాదేవి తన కేమీ పట్టనట్లుగా.

మోహన్ అదిరిపడ్డాడు ఆమె సాహసానికి.

'ఎందుకు వచ్చావు?'—కటువుగా అడిగింది రమ.

'నన్ను క్షమించు రమా?' అన్నాడు మోహన్ జాలిగా. అతనింకా గదిగుమ్మం లోనే నిలబడి ఉన్నాడు.

రమ తలవంచుకుని 'అంతేగా నీకు తెలిసింది?' అంది కఠినంగా.

'క్షమించురమా, నేను చాలా అసమర్థుణ్ణి!' మోహన్ బాధతో దీనుడైపోయాడు.

అతని ప్రార్థనతో, రమాదేవి హృదయంలో ఏనాడో ఇంకిపోయిన దుఃఖ స్రవంతి ఒక్కసారిగా పెల్లుబికింది. జాలిగా, కరిగిపోయేటంత జాలిగా ఏడ్చిందామె.

'ఏం లాభం క్షమించి! నువ్వు పాపం చేశావు! నేను అంతకంటే ఘోరమైన పాపానికి ఒడిగట్టాను. పిల్ల పరువుకోసం! ఇవాళ నేనూ నా అంతరాత్మతో మొరబెట్టుకుంటూనే ఉన్నాను. క్షమించు, క్షమించు అని లాభమేమిటి?'—

మోహన్ కళ్లల్లో అశ్రువులు తొణికాయి. అతను బాధతో క్రుంగిపోతూ అన్నాడు.

'నేనానాడు ధైర్యంగా నీకోసం నిలవలేకపోయాను రమా. కాని ఇవాళ సిద్ధంగా ఉన్నాను. నువ్వేం చేయమన్నా చేస్తాను. నీకోసం ఎందుకైనా సిద్ధంగానే ఉన్నాను.

కళ్ళు తుడుచుకుని బాధతో కంపిస్తూ అతనిమాటలు విన్నది రమ.

'ఇవాళ నాకోసం త్యాగం చేసేవాళ్ల కోసం ఎవరూ త్యాగం చేయరు! నేనూ ఎవరికోసమూ చేయలేను. ఈ లోకంలో ఎవరికెవరూ కారు మోహన్! నిజంగా త్యాగం చేయగలదాన్నే అవుతే ఈ భ్రూణహత్యకు పాల్పడేదాన్నే కాదు.' అందామె.

మోహన్ ఆమెవేపు విచారంగా చూస్తూ, మృదుస్వరంతో 'లోకంలో ఎవరికెవరూ ఎందుకుకారు రమా? ప్రస్తుతం నీ మనస్థితి ఆ విషయాన్ని నమ్మనివ్వటం లేదుగాని!' అన్నాడు.

రమ అతనివేపు సూటిగా చూస్తూ 'కాదు, కాదు. లోకంలో ఎవరి కెవరూ కారు మోహన్! అది కేవలం మనిషి బతకలేననుకోకుండా బతకటానికి కల్పింప



బడిన వృధా ఆశమాత్రమే ! నిజంగా ఈ సత్యం అవగతమవుతే మనిషి అసలు బతకలేడు. ఆ దుర్భరస్థితి నే నెరుగుదును,' అంది.

మోహన్ మాట్లాడలేదు. అతని గుండెలు చెప్పరాని వ్యథతో వ్రక్కలై పోతున్నాయి.

కాస్సేపాగి రమాదేవి గాద్గదికంగా అన్నది.

'కాని మీ అందరికంటే నేనే నయం! నే నంగీకరించిన ఈ భ్రూణహత్య మీ అందరి పరువూ కాపాడటానికైనా ఉపయోగపడింది. మీ రెందుకూ నిలవలేక పోయారు. నేను ఈ పనికి అంగీకరించటంలో కొంత దౌర్బల్యానికి లొంగిపోక పోలేదనుకో! కాని అందులో మీకే లాభపు పాలు హెచ్చు. పరువు కాపాడితే, పాపాలు చేసినా పిల్లనే నేను అమ్మకీ నాన్నకీ! పరువు కాపాడాక మురిపెంగా వచ్చి కబుర్లు చెబుతున్నావు నువ్వు! ఒక్కసారైనా నా పిల్లకోసం, తండ్రి నని ముందుకు రాలేని నీ దౌర్బల్యానికి నాకీ మహా పాపం!'— రెండు కాళ్లమధ్యా తల పెట్టుకుని జాలిగా ఏడ్చింది రమ.

'ఏడవకు రమా ఆత్మజాగృతిగల వ్యక్తు లొకసారి పొరపాటు చేస్తారు. రెండు సార్లు చేస్తారు. కాని ఎప్పుడూ దౌర్బల్యానికి దాసులై పోరు రమా నన్ను క్షమించు. నీ కన్యాయం చేశానని, నీ ఉసురుకొట్టి భస్మమైపోవాలని నేను విచారించని క్షణంలేదు!' అన్నా డత డామె చెయ్యి అందుకుంటూ.

రమ అసహ్యంతో చేతులు వెనక్కి తీసుకుంది.

'అవును మోహన్! ఆత్మజాగృతి గల వ్యక్తులు ఎప్పుడూ దౌర్బల్యానికి దాసులై పోరు! నేనూ అంతే! వెళ్లు మోహన్! నీ త్యాగంతో నాకింక నిమిత్తం లేదు!' అందామె.

మోహన్ బాధగా 'అంతేనా రమా?' అని అడిగాడు.

రమాదేవి విషాదంగా నవ్వి 'అంతే! అంతే మోహన్! వ్యర్థమైన క్షమాభిక్ష కోసం వచ్చావు! అదేగా నీకావలసింది! అంతకుమించి నాదగ్గర ఇప్పుడింక నీకేమీ లభించేదేలేదు!' అంది.

గ్రీష్మపుఎండ బయట నిప్పులుచెరుగుతోంది. వీధంతా విజనమై ఉంది. ఎక్కడా సవ్వడిలేని ఆ మధ్యాహ్నం వారిద్దరి హృదయాల్లోని శూన్యత్వానికీ, ఆవేదనకూ ప్రతిగా నిలచి ఉన్నట్లయింది.

రమ మాటల్లోని అర్థం గ్రహించలేని మోహన్ 'అంటే?' అని అడిగాడు.

'అంటే?'—రమ విరక్తిగా చూసింది. 'ఏముంది? పద్దెనిమిదేళ్ల ఈ వయసుకి మూడు దశాబ్దాలింకా ముందుకిపోయి బతుకుతున్నా నిప్పుడు! సామాన్యంగా మనుషు లా దశలో ఇవ్వగలిగే దేమిటి? వారి అనుభవం వారికి నేర్పే దేమిటి? క్షమ!! అదే నీకు నే నిస్తున్నా నిప్పుడు. చాలా?'

మోహన్ ఆశ్చర్యంతో స్తంభించి పోయాడు. నవ్వుతూ, తుళ్లుతూ చలాకీగా తిరిగే రమాదేవి జీవిత సమస్యల్నింత లోతుగా తీసుకోగలదని కాని, ఆమెలో ఇంతటి పరిపక్వహృదయ ముందని కాని గ్రహించని మోహన్ ఆశ్చర్యంతోకూడిన విషాదంతో, కన్నీటిని నిగ్రహించుకుంటూ మెల్లిగా అక్కడినుంచి వెళ్లిపోవటానికి ఉద్యుక్తు డయాడు.

అప్పుడే నిద్రలేచి వస్తున్న కామేశ్వరి అతన్ని చూసి అనుమానంతోనూ, భయం తోనూ అలాగే మ్రాన్పడి పోయింది.

ఆమెను చూడగానే 'క్షమించు అత్తయ్యా! ఇప్పట్లో ఇంక రాను!' అన్నాడు మోహన్ అపరాధిలా తల వంచుకుని.

'అస లిప్పుడు మాత్రం ఎందుకు వచ్చావు?' అని గర్జించింది కామేశ్వరి.

మోహన్ తలవంచుకుని బుద్ధి పూర్వకంగా ఆమె కోపాన్ని సహించి మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

'వెధవ ! జరిగిన దానికి సిగ్గులేదూ? ఇంకా వాడితో నీకేమిటి?'—కోపంతో మండలించే తల్లిని చూసి రమాదేవి నిర్లక్ష్యంగా 'నీ పరువుకేమీ నష్టం కాదులే అమ్మా!' అంది.

'ఏమిటే? వాడు,—'

'అమ్మా! ఇంకోమాట అన్నావంటే నేను విషం తాగి చస్తాను!'—భరించలేని బాధతో సహనం కోల్పోయి గట్టిగా అరిచింది రమాదేవి.

కూతురి కేకకి ఝడుసుకుని నిశ్చేష్టురాలై నోరు తెరుచుకు నుంచుంది కామేశ్వరి....

* * *

ఆ తర్వాత మోహన్ ఆ ఊళ్ళో కనిపించలేదు. ఒకనాడు శేషగిరి బజారుకి వెళ్లివస్తూ తల్లిని తీసుకుని, రెండేళ్లనించీ మిగిలి పోయిన పార్టు పూర్తిచేయటానికి మోహన్ మద్రాస్ వెళ్ళాడని ఎవరో చెప్పగా విని నవ్వుకున్నాడు.

'ఈ బుద్ధి ఇంతకుమును పేమైపోయిందో?' అనుకున్నా డతను.

—కాలం రెండు సంవత్సరాల కాలాన్ని మింగేసింది. ఈలోగా మోహన్ సంగతి పట్టించుకోవలసిన అగత్యం శేషగిరి కుటుంబాని కేమీ కలగలేదు. శేషగిరి ఎంతసేపూ కూతుర్ని పూర్వపు మనిషిలా తయారు చేయగల మార్గాల నన్వేషించటంలో నిమగ్నుడై పోయాడు. అతని ప్రయత్నాలు అధికమవుతున్నకొద్దీ ఆమె తనకై తాను బాహ్యాలోకానికి మరింత దూరంగా వెళ్లిపోతోంది....

కాని రెండేళ్ళ తర్వాత ఒకనాడు శేషగిరి ఆఫీసులో పనిలో నిమగ్నుడై ఉండగా తన పేరుతో వచ్చిన ఒక ఉత్తరం అతని ఆశ్చర్యానికంతులేకుండా చేసింది.

అందులో మోహన్ తన ఎదుట నుంచుని మాట్లాడుతున్నట్లే అనిపించింది శేషగిరికి.

'మామయ్యా!

బంధుత్వం పేరిట మీరు నా కిచ్చిన చనువూ, స్వతంత్రాలను సక్రమంగా వినియోగించుకో లేకపోయా నన్న లజ్జ నన్నొదిలేదికాదు. నాకు తెలుసు. జరిగిన వాటిని రూపురేఖలతో నశింపచేయటం అసాధ్యమైన పని. అలా ప్రయత్నం చేసినా జనమేజయుడి సర్పయాగంలా ఏ కాస్తో దానితాలూకు చిహ్నం మిగలకపోదు. మనం వాటిని నశింపచేయాలని ప్రయత్నించినా వాటి ఛాయలైనా హృదయంలో స్థావర మేర్పరచుకుతీరుతాయి. అవి జరగలేదనుకునీ, జరిగినా ఏదో జరిగాయిలే అనుకునీ అంతరాత్మ నోరెత్తకుండాచేసే శక్తి అందరికీ ఉంటుందేమో. కాని నాకుమాత్రం లేదు. అందుకే ఈ చిన్న ఉత్తరం! కాదు! విజ్ఞప్తి!

మూడేళ్ళకిందట రమాదేవి జీవితంలో ఒక దుస్సంఘటనకు కారకుణ్ణి నేనని నీకు తెలుసు. అత్తయ్యకి తెలుసు. మావాళ్ళకి తెలుసు. లోకానికి తెలుసు. ఇందరికీ తెలుసన్న విషయం మనకందరికీ తెలుసు. కాని లోకానికంతా కనీసం చూచాయగానైనా ఈ విషయం తెలుసని మనమెరిగిఉండీ, మనంతట మనం బయట పడకుండా జాగ్రతపడతాం! అంటే ఎవరూ మనల్ని ఎదుటపడి 'ఇలాగా' అని అడిగే దండనకి దూరంగా ఉంటామన్న మాట! పరువు చేసే ట్రిక్ ఇక్కడే ఉంది! ఒక మనిషి సంఘ విరుద్ధంగా ప్రవర్తించి కూడా దానిని బట్టబయలు కాకుండా కాపాడుకో గలిగినప్పు డతని పరువంతా మొహామెదురుగుండానే! తక్కినదంతా అతని వీపు వెనక భాగోతం!! ఎందుకు చెప్పవస్తున్నా నంటే మన చాటుగా మనల్ని గురించి అందరూ చెప్పుకుంటూనే ఉంటారు. పరువనేమాటకి నిజంగా చూస్తే విలువలేదనే అనిపిస్తోంది నాకు! కాని అది సంఘక్షేమానికి అవసరమే అనుకో!

పోతే, - ఈ నాటికీ నిజంగా జీవితంలో మన్నించతగినదీ, విలువకట్టతగినదీ, చివరకు మిగిలేదీకూడా ఒక్కమాటేనని అనుభవ పూర్వకంగా గ్రహించాను. నీకు తెలియదేమో. నువ్వూ అత్తయ్యా రమాదేవిని మెడ్రాస్ తీసుకువెళ్ళి, ప్రతిష్ఠకు భంగమైన ఆ కాస్త అడ్డు తొలగించేసి మళ్లీ ఊరు చేరుకున్నాక ఒకనాటి మధ్యాహ్నం సాహసించి మీ యింటికి వచ్చాను నేను. అప్పుడు రమ అన్నమాటలు, పొందిన బాధ నా జీవితాన్నే తలక్రిందులు చేసివేయ గలిగాయి. నాలో అంతవరకూ నిగూఢంగా ఉన్న మానవత్వం మేల్కొన్నది.

రమాదేవికి నువ్వు పెళ్లి చేయాలనుకుంటున్నా, ఆమె అందుకు అంగీకరించటం లేదని విన్నాను నీ కామె ఒక్కగానొక్క కూతురు! ఆమె మీద మీ రెన్నో ఆశలు పెట్టుకుని ఉంటారు. ముచ్చటలన్నీ తీర్చవలసిన ఆమె ఇరవైఏళ్లకే ఇలా విరాగిని అయిపోయిందంటే, ఈ విషాద పరిణామానికి కారకులెవరో, ఆ విషయమై నా అంతరాత్మ ఎప్పుడూ నన్ను గుచ్చిగుచ్చి దండిస్తూనే ఉంటుంది.

ఇప్పుడు నేను ఇంజినీరింగ్ చదువుతున్నాను. స్వతహాగా తెలివితేటలు కలవాణ్ణి కాదు. ఆ సంగతి నీ ముందు అంగీకరించటంలో నా కవమానం లేదు. కాని పూర్వీకుల ఆస్తిపాస్తులున్నాయి. అందం విషయం నేను చెప్పను. కాని ఏ అర్హతలున్నా లేకపోయినా, తలెత్తుకోలేని ఒకానొక నేరమే ఇవాళ నన్నిలా అడగమని ప్రోత్సహిస్తోంది. రమాదేవి పెళ్లి వద్దని అంటున్నదంటే నాలో ఒక ఆశ, ఒక సందేహం కలుగుతున్నాయి. ఆమె నన్ను చేసుకోవటాని కంగీకరిస్తుందేమో అడుగు. !

మామయ్యా! నేను చేసినపని నన్ను కేవలం తుచ్ఛుడ్నిగా మాత్రమే నీ దృష్టిలో నిలిపి ఉంటుంది. కాని ఇవాళ నీ ముందు నా పాపా న్నంగీకరిస్తూ, నా అంతరాత్మ సాక్షిగా చెబుతున్నాను. నేనామె నొక్కతెనే ఎరుగుదును! ఆమె తోనే మనిషినయ్యాను.

ఒకవేళ ఈ ఉత్తరం యొక్క లక్ష్యాన్ని నువ్వు సఫలం చేయలేకపోయినా, నేను చేసినపనికి నన్ను మనస్ఫూర్తిగా క్షమిస్తే అదే చాలు నాకు!! ఇంక ఉంటాను....'

ఉత్తరమంతా పూర్తయేసరికి శేషగిరి కళ్లల్లో అతనికి తెలియకుండానే కన్నీరు జాలు వారింది. అతను కర్చీపుతో వాటిని గబగబా తుడిచేసుకుంటూ మళ్లీ మళ్లీ చదివాడా ఉత్తరాన్ని.

జీవితంలో ఏ సరదాలూ, ఆనందాలు అభిలషించకుండా అన్నిటికీ దూరంగా ఉంటూ ప్రపంచంతో సాధ్యమైనంత వరకు సంబంధం తెంచేసుకోవటానికే ఎప్పుడూ ప్రయత్నించే కూతుర్ని చూసి చూసి శేషగిరి మానసికంగా చాలా బడలిపోయాడు. అతను ఇప్పుడుతీవ్రంగా విశ్రాంతి కోరుతున్నాడు. కాని అదే అతనికి లభించటంలేదు. కూతురు ఒక యింటిదై.— అథవా కాకపోయినా ఇలా ఉండిఅయినా నవ్వుతూ తిరిగితే తప్ప అతనికి నిజంగా విశ్రాంతిలేదు.

కూతురుకోసం అంతగా బాధపడే అతను మోహన్ ఉత్తరం చూడగానే, అతని నిజమైన పశ్చాత్తాపం, నిష్కాలుష్యం అవగాహన అవటంతో ఎన్ని సార్లో కన్నీరు కార్చకుండా ఉండలేక పోయాడు.

ఆ రోజు ఆఫీసునుంచి ఇంటికి వెళ్ళగానే శేషగిరి కూతురుతో ఈ విషయమై చర్చించాలనుకున్నాడు. కాని తీరా యింటికివెళ్లాక ఎలా ప్రారంభించాలో తోచలే దతనికి.

అసలు రమాదేవి కీ అనుభవం అయ్యాక తండ్రితో ఎక్కువగా మాట్లాడటం మానివేసింది. అతనూ ఆమె నెలా పలకరించాలో ఏమనాలో అర్థంకాక ఊరుకునేవాడు. ఇప్పుడీ రెండేళ్లలో తిరిగిచూసుకుంటే తమ యిద్దరిమధ్యా గల ప్రేమ బంధాలన్నీ దూరమై. నిద్రాణమై, ఒక్క తండ్రీ కూతురనే స్ఫురణ మాత్రమే మిగిలినట్లనిపించింది శేషగిరికి; ఏమైనా ఇవాళ ఆమెతో ముఖాముఖి చర్చించక తప్పలేదతనికి.

మోహన్ రాసిన ఉత్తరం భార్యకి, చదివి వినిపిస్తే "ఎన్ని సంబంధాలొచ్చినా ఒద్దంటుంది. దానికి వాడిమీదే ఉందేమో పోనీ! ఎలాఅయినా పిల్ల ఒకయింటిదై, బతికి బట్టకడితే చాలు!' అంది కామేశ్వరి కళ్లనీళ్లతో.

దాంతో శేషగిరికి ధైర్యం వచ్చింది.

అతను కూతుర్ని పిలిచి 'ఆ పోయిన పార్టయినా పూర్తిచేయకూడదమ్మాయ్!' అంటూ ప్రారంభించాడు.

శుష్కించినా సౌందర్యం కోల్పోని రమాదేవి సన్నని శరీరం ద్వారబంధాన్నానుకుని ఉంది. చూపులు క్రిందికి దించుకుని, అతినిర్లిప్తంగా తండ్రి మాటల కెదురు చూస్తున్న ఆమె ఏ భావమూలేని చూపులతో అతనివేపు చూసింది.

శేషగిరి ధైర్యం కూడదీసుకుని 'మోహన్ ఉత్తరం వ్రాశా డివాళ.' అన్నాడు.

ఉలిక్కి పడింది రమాదేవి.

'ఇదుగో! చదువమ్మా!' అంటూ అతి ప్రసన్నంగా, ఆమెకి ధైర్యమిస్తూ అతనా ఉత్తరం ఆమె కందించాడు.

రమాదేవి అది తీసుకుని చదివింది.

ఉత్తర మంతా చదవటం అయాక కళ్లెత్తితే, కళ్ళలో రెండు నీటి బిందువులు! శూన్యమైన శుష్కపు చూపులు!!

'ఏవఁమ్మా? ఏమంటావు?' అని అడిగాడు శేషగిరి ఆమెనిచూసి నీరైపోతూ.

కాస్సేపాగి మెల్లగా అంది రమాదేవి.

'ఏమంటాను? కాని,—ఉహుఁ ఒద్దు.' అంది తల తిప్పుతూ.

'అంటే? అదేమిటమ్మా? ఎన్నాళ్లిలా ఉంటావు? ఎన్నాళ్లిలా నిన్ను చూస్తూ మమ్మల్ని క్షోభపడమంటావు?' అన్నాడు శేషగిరి సహించలేని దుఃఖంతో.

కామేశ్వరి ఏడుపే ప్రారంభించింది.

'క్షమించు నాన్నా! పిల్లల్ని చంపుకోకతప్పని వారి దుఃఖానికంటే మీది ఎక్కువకాదు. ఎందుకంటే మీరు మీ పిల్లకి తిండీ పెడుతున్నారు, బట్టా యిస్తున్నారు. మీ కప్రతిష్ఠ తెచ్చే పని చేసినా యింకా నన్ను భరిస్తూనే ఉన్నారు. నిజానికిందులో ఏ వొక్క దానికి ఆదుకోలేనివారి మాటేమిటి?'

శేషగిరి కామె మాటల్లోని వ్యంగ్యం సూటిగా మనసుకి వచ్చి నాటింది. అతను చిన్నబుచ్చుకున్న మొహంతో 'అవన్నీ జరిగి పోయినయమ్మా, జరిగిన వాటిని మనస్సులో పెట్టుకుని ఇంతగా మధనపడకూడదమ్మా! ముందు నూరేళ్ల బ్రతుకుంది. ఇలా బాధపడుతూ ఎన్నాళ్లు గడుపుతావు? అన్నాడు.

'లేదునాన్నా! జరిగిపోయినయ్యేకదా అని మరచిపోవటం తేలికే! కాని ఆ జరిగిపోయిన సంఘటన లిచ్చే అనుభవం మాత్రం మరపురానిది. నాకు జరిగిపోయినవికాదు; అవి ఇచ్చే అనుభవం ముఖ్యం. ఒక్కటేనాన్నా! లోకంలో ప్రేమలు సంఘానికీ సంబంధాలకూ, పరువూ ప్రతిష్ఠలకూ, పదవులూ హోదాలకూ లోబడే పనిచేస్తాయి. మనుషులంతా అశక్తులు. ఎవరూ జీవితాల్ని తమ స్వంతం చేసుకోలేనట్లే ఎవరూ వాటిని ఒదులుకోనూలేరు. అట్లాగే మనిషితో మనిషి సంబంధం కూడా! ఎవరికోసం ఎవరూ ఏ పరిస్థితిలోనూ నిలవలేరు. కాని నిలవలేని వారి అశక్తతని అందరికోసం అందరూ మరచిపోతూ, మరచిపోలేని ఏ ఒక్కక్షణమో ఘర్షణపడుతూ, మళ్లీ యథాస్థితిగా జీవితం గడుపుతారు. ఇటువంటి శాశ్వతం లేని ప్రేమకోసం ఇవాళనన్ను ఆజన్మాంతమూ ఇంకొకరికి బందీని కమ్మంటావా నాన్నా? అలా కావడంలో నాకు సందేహమేమీలేదు. నాకిప్పుడెలా బతికినా ఒకటే! కాని అలా కావటంలో ఇంకొకరికి ఏం సుఖం నావల్ల? మీలాగానే ఆ వ్యక్తీ ఆజన్మాంతం కుంగిపోతూ గడుపుతాడు. నాకింక మారటం — జీవితంపట్ల రక్తి పెంచుకోవటం అసాధ్యమనిపిస్తోంది. నాకిప్పుడీ లోకంలోకి ఎందుకు వచ్చానో ఆ పాపం పరిపూర్తి అయిందనిపిస్తోంది నాన్నా!' అంది రమాదేవి.

వయసుకుమించిన ఆమె మాటలకు శేషగిరి కళ్లనీళ్లపర్యంతం అయ్యాడు. అతను దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ 'లోకంలో ఎందరు తప్పులుచేయటం లేదమ్మా? అందరూ ఇలాగే చేస్తున్నారా? నీలాగే అయిపోతున్నారా?' అని అడిగాడు.

'కాకపోతే అది వారి అదృష్టం నాన్నా! సామాన్యంగా ఒక్క అనుభవంతో బుద్ధితెచ్చుకోదు మనసు. ఇంకా ఆశిస్తూనే ఉంటుంది. నేనూ ఆశించే దాన్నేనేమో! కాని నేను చేసిన పాపం నాకెంతో అనుభవమిచ్చింది నాన్నా! మనుషులు నేనూహించనంత వింతగా నాకు అర్థమయ్యారు. ఎవరినీ నేనిప్పుడు నిందించను. కాని ఒకప్రాణి హత్యకు కారకురాలి ననే స్ఫురణ నన్నీలోకంతో కలవనివ్వదు నాన్నా! నాకీ సుఖాలనుభవించటం చేతకాదింక!' అంది.

—గదిలో చీకటి నీడలు వ్యాపిస్తున్నాయి. దుర్భర వేదనాగ్నితో దహించుకుపోతూ మూడుమూర్తులా గదిలో దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుని ఉన్నాయి. ★